## క్లుప్తంగా

### దరఖాస్తుల ఆహ్వానం

సుల్తాన్‌బజార్: వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన మహిళల నుంచి మిట్టల్ ఎక్సలెన్సి అవార్డ్స్–2023 నామినేషన్స్ కోసం సోనమ్ మిట్టల్ ఉమెన్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆహ్వానిస్తుందని ట్రస్ట్ ప్రతినిధి శివకుమార్ మిట్టల్ తెలిపారు. ఈ మేరకు శనివారం బొగ్గులకుంటలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వివిధ రంగాల్లోని ఎక్సలెన్సి ఇన్ జర్నలిజం, కల్చరల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అవార్డ్ ఫర్ ఫిజికల్లి చాలెంజ్‌డ్, హెల్త్‌కేర్ అండ్ నర్సింగ్, స్పోర్ట్స్, రూరల్ డెవలప్‌మెంట్, ఉమెన్ డెవలప్‌మెంట్, రూరల్ ఏరియా తదితర రంగాల్లో నిష్ణాతులైన మహిళల నుంచి నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభావంతులైన ఆసక్తిపరులు తమ నామినేషన్లను ఏప్రిల్ 21వ తేదీ లోగా పంపాలని కోరారు. వివరాలకు 91826 51734లో సంప్రదించాలని కోరారు.

### క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్



న్యాయవాది కిరణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: హైదరాబాద్ నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రముఖ సీనియర్ న్యాయవాది కిరణ్‌కుమార్ 132 ఓట్ల మెజార్టీతో సమీప అభ్యర్థిపై విజయం సాధించారు. ఈ సందర్భంగా న్యాయవాది కిరణ్‌కుమార్‌ను బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అనంతరం విజయంపై సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. న్యాయవాదుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానన్నారు. పెద్ద ఎత్తున బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వినోద్ కుమార్



వినోద్‌కుమార్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

యాకుత్‌పురా: హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో సీనియర్ న్యాయవాది మారూడి వినోద్‌కుమార్ నూతన అధ్యక్షుడిగా గెలుపొందారు. శుక్రవారం పురాణి హవేలిలోని సిటీ సివిల్ కోర్టులో నిర్వహించిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో వినోద్ కుమార్ న్యాయవాది ఉమేందర్‌కుమార్‌పై ఘన విజయం సాధించారు. నూతన అధ్యక్షుడిగా గెలుపొందిన వినోద్ కుమార్‌ను న్యాయవాదులు బస్వరాజు, ప్రేమ్ కిషోర్, సోంరాజ్‌తో పాటు శ్రీధర్, అనిల్‌బాబు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

### రాహుల్ గాంధీపై అనర్హత వేటు సరికాదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చార్మినార్: రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నారు. రాహుల్‌గాంధీపై వేసిన అనర్హత వేటును నిరసిస్తూ శనివారం అశోక్ పిల్లర్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. అనంతరం నాయకులు కె.ఎస్.ఆనంద్‌రావు, కాశమోని శ్యాంరావు ముదిరాజ్ తదితరులు విలేకర్లతో మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అన్ని వర్గాల ప్రజల నుంచి వ్యతిరేక ఉందన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ నిరంకుశత్వంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వానికి త్వరలో ప్రజలు బుద్ధి చెప్పనున్నారన్నారు.

### 'మజ్లిస్ పార్టీ బాధ్యత వహించాలి'

చార్మినార్: పత్తర్‌గట్టి మసీదు వద్ద జరిగిన దాడికి మజ్లిస్ పార్టీ బాధ్యత వహించాలని చార్మినార్ నియోజకవర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన ఉమామహేంద్ర ఆరోపించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా నగరం నుంచి పాతబస్తీకి ద్విచక్ర వాహనాలపై వస్తున్న యువకులను రోడ్డు మధ్యలో నిలిపివేసి దాడులకు పాల్పడం సరికాదన్నారు. గతంలో ఒక బహిరంగ సభలో చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ బీజేపీ వాళ్లు పాతబస్తీలోకి జెండాలతో చొచ్చుకొస్తున్నారని.. దీనిని చూస్తూ ఊరుకోవద్దని.. వారిని నివారించాలని చెప్పిన మేరకే గురువారం రాత్రి పత్తర్‌గట్టిలో యువకులపై స్థానికులు దాడులకు పాల్పడ్డారన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు దేశంలోనే ఉన్నారని.. పాతబస్తీ కూడా దేశంలోనే ఉందనే విషయాన్ని మజ్లిస్ పార్టీ ప్రజా ప్రతినిధులు గుర్తుంచుకోవాలన్నారు.

# రంజాన్ పవిత్ర మాసం: అక్బరుద్దీన్ ఒవైసీ

గోల్కొండ: రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని అల్లా ఈ మాసంలో ప్రతి ఒక్కరిని కనికరిస్తాడని మజ్లిస్ శాసనసభ పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. శనివారం కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ నానల్‌నగర్ డివిజన్ సాలార్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసంలోని ప్రపంచ ముస్లింలకు అల్లా దివ్యఖురాన్ గ్రంథాన్ని వరంగా ఇచ్చారన్నారు. అందువల్లే రంజాన్ మాసం నెలవంక దర్శనమిచ్చిన నాటి నుంచే తరావీ ప్రార్థనలు జరుగుతాయన్నారు. ఈ తరావీ ప్రార్థనల్లో దివ్యఖురాన్ గ్రంథ పఠనం ఉంటుందని ఆయన అన్నారు. అంతేకాకుండా రంజాన్ మాసంలో అర్హులైన వారంతా విరివిరిగా పేదలకు దానధర్మాలు చేయాలన్నారు. జకాత్ వల్ల నిరుపేదలు సైతం రంజాన్ ఉపవాస దీక్షలు ఉంటూ ఆనందంగా రంజాన్ పండుగను జరుపుకునే అవకాశం ఉంటుందన్నారు. కాగా ఇఫ్తార్ విందులు కాలక్షేపానికి, వినోదాల కోసం కావని, స్థానికుల మధ్య ప్రేమాభిమానాలు పెంపొందించడానికని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా ప్రతి ఒక్కరికి ఖజూర్ అందించారు. ఈ కార్యక్రమంలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్, మజ్లిస్ సీనియర్ నాయకులు హారూన్ ఫరాన్, అలీమొద్దీన్, వజీ ఉజ్‌జమా, బదరుద్దీన్, ఎ.కె.పఠాన్ తదితరులున్నారు.



హకీంపేట్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో అక్బరుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

## ముగిసిన వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు



వేద పండితులతో చక్రస్నానం

లంగర్‌హౌస్: ఆధ్యాత్మం రమణీయంగా కొనసాగిన వసంతనవరాత్రి బ్రహ్మోత్సవాలు శ్రీరాముడి మహా పట్టాభిషేకంతో ముగిశాయి. లంగర్‌హౌస్ త్రివేణి సంగమంలోని చారిత్రాత్మక మత దేవాలయం జానకి సమేత వీరవెంకట విజయ రాఘవ స్వామి ఆలయంలో పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో ఉగాది నుంచి బ్రహ్మోత్సవాలు కొనసాగాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా సీతారాములు, లక్ష్మణుడికి పంచామృతాలు, నవరసాలు, నవ దాన్యాలు, సుంగద ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవగా చక్రస్నానం నిర్వహించారు. పూర్ణకుంభం అనంతరం వేదపండితులు రాజనర్సింహచారి, శ్రీనివాస్‌చారి సమక్షంలో శ్రీరాముడికి మహా పట్టాభిషేకం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు రాజువస్తాద్, లింగారెడ్డి, సాయిటెక్ ముత్యాల శేఖర్‌బాబు, మామిడాకుల కృష్ణ, నర్సింహారెడ్డి, డాక్టర్ శివకుమార్, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

## అలరించిన భక్తి సంగీతం



భక్తి సంగీత కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

సుల్తాన్‌బజార్: చిన్నారులకు చిన్ననాటి నుంచే భారత సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చాలని సుమ మ్యూజిక్ అకాడమీ ప్రిన్సిపాల్ బట్టారం సుష్మ మహేష్‌కుమార్ అన్నారు. సుమా మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి సంగీత కార్యక్రమంలో చిన్నారులు సాహిత్య, రిషిక, సుదీక్ష, స్వేచ్ఛ, రుద్రాన్, సినీవైభవ్, రేయాన్ష్, నిధీష్, కీర్తిలచే నిర్వహించిన సంగీత కార్యక్రమంలో చిన్నారులు ఆలపించిన భక్తిగీతాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

## ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సమీనా బేగం

యాకుత్‌పురా: ప్రతి ఒక్కరూ పోషకాలు కలిగి ఉన్న ఆహారాన్ని తీసుకుంటే ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటుందని తలాబ్‌చంచలం కార్పొరేటర్ డాక్టర్ సమీనా బేగం సూచించారు. పోషణ పక్షం వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ చార్మినార్ ప్రాజెక్టు అమన్‌నగర్ సెక్టర్ ఆధ్వర్యంలో శనివారం భవానీనగర్ నషేమాన్‌నగర్‌లో ప్రత్యేక కార్యక్రమం, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. చిన్నారులు, కిషోరా బాలికలు, మహిళలు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు పోషకాలు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా పాలు, గ్రుడ్లు, ఆకుకూరాలు, పోషకాలు కలిగి ఉన్న పండ్లు తీకుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ చార్మినార్ ప్రాజెక్టు సీడీపీఓ జోత్స్నరెడ్డి, మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకుడు షేక్ జఫర్, సెక్టర్ సూపర్‌వైజర్ సవిత్రి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## నేడు ఆత్మీయ సమ్మేళనం

గోల్కొండ: నేడు కార్వాన్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని బీఆర్‌ఎస్ కార్వాన్ నియోజకవర్గ నాయకుడు అంబటి శ్రీనివాస్ అన్నారు. బీఆర్‌ఎస్ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి జీవన్‌సింగ్ ఆధ్వర్యంలో నేడు జాఫర్‌గూడ కార్వాన్ మోహిని ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు ఈ సమ్మేళనం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సమ్మేళనానికి రాష్ట్ర మంత్రులు మహమూద్ అలీ, తలసరి శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ గ్రేటర్ అధ్యక్షుడు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్, అదే విధంగా బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు దాసోజు శ్రవణ్‌లు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని ఆయన తెలిపారు. కార్వాన్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

## ట్రాఫిక్ నిబంధనలు అందరూ పాటించాలి



విద్యశ్రీ ఎక్స్‌పో ప్రదర్శనను తిలకిస్తున్న ఏసీపీ శంకర్‌రాజ్, చైర్మన్ శ్యామ్‌వెరా

జియాగూడ: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. ఈ మేరకు శనివారం జియాగూడలోని విద్యశ్రీ హైస్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శనకు హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాలలో ఎక్కువ శాతం మైనర్లే మృతిచెందుతున్నారని, తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలను పిల్లలకు ఇవ్వొద్దని సూచించారు. వాహనాలు అతివేగంతో నడపరాదన్నారు. అలాగే గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి కూడా వివరించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే వైజ్ఞానిక ప్రదర్శనపట్ల ఆసక్తి చూపడం హర్షణీయమన్నారు. స్కూల్ చైర్మన్ శ్యామ్‌వెరా మాట్లాడుతూ.. విద్యార్థులు చదివిన పాఠ్యాంశాల నుంచే ప్రదర్శన చేపట్టినట్లు తెలిపారు. స్కూల్ డైరెక్టర్ సునితా శ్యామ్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు నరహరిచారి, కార్వాన్ నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ నవీన్‌రావుకు సత్కారం



ఎమ్మెల్సీ నవీన్‌రావును సత్కరించిన ఆల పురుషోత్తమ్‌రావు తదితరులు

అబిడ్స్: ఎమ్మెల్సీ నవీన్‌రావును బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా సత్కరించారు. నూతన ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేపట్టిన నవీన్‌రావును గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు ఆల పురుషోత్తమ్‌రావు, రాంచందర్‌రాజు, చంద్రారెడ్డి హర్షవర్ధన్‌రావు శనివారం ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

## వార్షికోత్సవం



కార్యక్రమంలో దుర్గారాణి

గోల్కొండ: విద్యాబోధనను తామెన్నడూ వ్యాపారంగా మార్చలేదని హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం కమిటీ అధ్యక్షురాలు దుర్గారాణి అన్నారు. శనివారం దుర్గారాణి బ్రైట్ ఫ్యూచర్ మొదటి వార్షికోత్సవం కార్వాన్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొదటి వార్షికోత్సవాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా రాబోవు విద్యాసంవత్సరంలో ప్రీ ప్రైమరీ నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పి. శశిధర్, ఆర్. ప్రేమాచారి, పి.లత, ఎస్.మాధవి, బి. స్వాతి, పి.లక్ష్మి తదితరులున్నారు. కమిటీ సభ్యులు పిల్లలచే కేక్ కటింగ్ చేయించి ఈ విద్యాసంవత్సరాన్ని ప్రతిభావంతంగా పూర్తి చేసిన వారికి బహుమతులు అందజేశారు.

## చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

గోల్కొండ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలతో దేశంలోని రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారని సీఐటీయూ నగర కన్వీనర్ మల్లేష్ అన్నారు. శనివారం మెహిదీపట్నం రైతుబజార్ వద్ద ఆయన చలో ఢిల్లీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 5న ఢిల్లీలో రాంలీలా మైదానంలో జరిగే కిసాన్ సంఘర్షన్ ర్యాలీని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, యాదమ్మ, నర్సమ్మ, లక్ష్మణ్, వెంకటేష్ తదితరులున్నారు.

## ఉద్యోగులకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం



ముజీబ్ హుస్సేన్‌ను సత్కరించిన శ్రీనివాస్‌గౌడ్

అబిడ్స్: ఉద్యోగులకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉంటుదని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఉద్యోగుల కోసం నిరంతరం కృషి చేస్తూ తరచూ పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీను శనివారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఘనంగా సత్కరించి అభినందించారు. మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బంగారు తెలంగాణ సాధనలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకంగా మారిందన్నారు. డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. హైదరాబాద్ జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఉద్యోగులు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నానన్నారు.

## ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చిన్నారులు

గోల్కొండ: చిన్నారులను ప్రాథమిక దశలోనే సానపెడితే వారు వజ్రంలా తయారవుతారని గోల్కొండలోని మోతీ దర్వాజలోని ద రైజింగ్ స్టార్ నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ షెహబాద్ ఖాద్రి అన్నారు. శనివారం పాఠశాలలో చిన్నారుల గ్రాడ్యుయేషన్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కిండర్ గార్డెన్, టీపీ పూర్తి చేసుకున్న చిన్నారులకు ఆయన పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ సయ్యద్ ఫహీమ్, ఐటా నగర అధ్యక్షుడు మహమూద్ అలీ సోహెల్, ఆసిఫ్‌నగర్ మండల ఐటా అధ్యక్షులు హబీబ్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శ



కరుణాకర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బండారు దత్తాత్రేయ

గోల్కొండ: దివంగత బీజేపీ రాష్ట్ర నాయకులు, గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన నాయకుడని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. శనివారం ఆయన గుడిమల్కాపూర్‌లోని దివంగత దేవర కరుణాకర్ నివాసానికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ.. నగరంలో పార్టీ కోసం ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. బీజేపీని హైదరాబాద్ జంట నగరాలలో ఇంటింటికీ పరిచయం చేసిన నాయకులలో ఆయన ఒకరని, నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాలలో బీజేపీ, అనుబంధ మోర్చాలను పటిష్టంగా తయారు చేసిన కరుణాకర్‌దేనని ఆయన అన్నారు. దివంగత నాయకుడి కుటుంబసభ్యులు దేవర వంశీ, దేవర రాజేశ్వర్, దేవర శ్రీనివాస్ తదితరులున్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. కమేళా, ఖిల్వత్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

## నేటి యువతరానికి కుటుంబ విలువలను నేర్పించాలి



నాగసుబ్రహ్మణ్యాన్ని సన్మానిస్తున్న జస్టిస్ భవానీ ప్రసాద్

గన్‌ఫౌండ్రీ: నేటి యువతరానికి కుటుంబ విలువలను నేర్పించాల్సిన అవసరం ఎంతగానో ఉందని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గ్రంధి భవానీ ప్రసాద్ అన్నారు. శనివారం రవీంద్రభారతిలో సాంస్కృతిక బంధు సారిపల్లి కొండల్‌రావు సౌజన్యంతో యువ కళావాహిని ఆధ్వర్యంలో లవకుశ చిత్రంలో కుశుడుగా నటించిన నాగసుబ్రహ్మణ్యాన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లవకుశ చిత్రం శష్టిపూర్తి పూర్తిచేసుకున్న సందర్భంగా నాటి నటుడికి అభినందనలు తెలియజేయడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. కుటుంబ విలువలు, కుటుంబ వ్యవస్థను తెలియజేయాలని సూచించారు. అంతకు ముందు గాయనీ గాయకుల గీతాలాపన ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ అధ్యక్షులు సారిపల్లి కొండల్‌రావు, అభినందన సేవా సంస్థ అధ్యక్షురాలు భవాని, యువ కళావాహిని అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జేఎన్‌ఏఎఫ్‌ఏయూలో నాన్ టీచింగ్ స్టాఫ్ ఎన్నిక



మహిపాల్‌రెడ్డి

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ బోధనేతర సంఘం ఎన్నికలు శనివారం నిర్వహించారు. ఎటువంటి పోటీ లేకుండా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవాన్ని ఎన్నుకున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కొడాలి సుందర్‌కుమార్ తెలిపారు. ఎన్నికైన నాయకులకు నియామక పత్రాలు అందజేశారు. అధ్యక్షుడిగా కోమటిరెడ్డి, మహిపాల్‌రెడ్డి (అసిస్టెంట్ రిజిస్ట్రార్), ఉపాధ్యక్షులుగా షేక్ అక్బర్ (సూపరింటెండెంట్), జి.నరేందర్ (సీనియర్ అసిస్టెంట్), ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ మాసూమ్ అలీ (అసిస్టెంట్ రిజిస్ట్రార్), సంయుక్త కార్యదర్శిగా ఎస్.అశోక్ (సీనియర్ అసిస్టెంట్), కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.అరుణ్‌కుమార్ (సీనియర్ అసిస్టెంట్), సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా ఆర్.శ్రీనివాస్ (జూనియర్ అసిస్టెంట్), కోశాధికారిగా మహ్మద్ అబ్దుల్ రహీం (సీనియర్ అసిస్టెంట్), సలహాదారులుగా కె.విష్ణువర్ధన్ (అసిస్టెంట్ రిజిస్ట్రార్)లు ఎన్నుకోబడ్డారు.

## దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గౌలిపురా: రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తూ ఓల్డ్‌సిటీ కాంగ్రెస్ నాయకులు లాల్‌దర్వాజా నెహ్రూ విగ్రహం వద్ద శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీలు అల్లం భాస్కర్, మామిడి కృష్ణకుమార్, కె.ఎస్.ఆనంద్‌రావు, వెంకటేశ్, సిటీ కాంగ్రెస్ నాయకులు కాశ్యమోని శ్యాంరావు ముదిరాజ్, నవీన్, రాజుయాదవ్, మామిడాల శ్రీనివాస్, సుభాష్, డి.శ్రీనివాస్, కె.వెంకటేశ్, ముత్యం యాదవ్, డల్లు శివ పాల్గొన్నారు.

## సందడే.. సందడి..

చార్మినార్: ఓవైపు రంజాన్ మార్కెట్ కొనసాగుతుండగా.. మరోవైపు వీకెండైన శనివారం పాతబస్తీ చార్మినార్ పరిసరాలు సందర్శకులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు చార్మినార్ కట్టడంతో పాటు మక్కా మసీదు, చౌమహల్లా ప్యాలెస్, సాలార్‌జంగ్ మ్యూజియం, జూపార్కు తదితర పర్యాటక ప్రాంతాలన్నీ సందర్శకులతో కళకళలాడాయి. చార్మినార్ కట్టడం వద్ద రోజంతా పర్యాటకుల సందడి కనిపించింది. ఎండను సైతం లెక్క చేయని సందర్శకులు అధిక సంఖ్యలో పాతబస్తీలోని పర్యాటక స్థలాలను సందర్శించారు.



## వీర హనుమాన్ విజయయాత్రను జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ నాయకులు

యాకుత్‌పురా: హనుమాన్ జయంతి సందర్భంగా ఈనెల 6న విశ్వ హిందూ పరిషత్తు, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించే వీర హనుమాన్ విజయ యాత్ర బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని వీహెచ్‌పీ ఆర్యనగర్ జిల్లా అధ్యక్షుడు విశాల్ ప్రసాద్ పిలుపునిచ్చారు. విజయ యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శనివారం లలితాబాగ్ బాగ్ సరస్వతీనగర్‌లోని వీహెచ్‌పీ కార్యాలయంలో ఆయన నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏడాది మాదిరిగానే గౌలిపురా మిత్ర క్లబ్ ప్లే గ్రౌండ్ నుంచి గౌలిగూడ రామ్ మందిరం మీదుగా సికింద్రాబాద్ తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు హనుమాన్ శోభాయాత్ర ఉంటుందన్నారు. వీర హనుమాన్ విజయయాత్రకు పాతబస్తీకి చెందిన హిందువులందరూ పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షులు భానుమూర్తి, సహ కార్యదర్శి మైల్‌కోల్ ముఖేశ్ యాదవ్, కార్యదర్శి విశాల్, సునర్కర్ విశాల్, బజరంగ్ దళ్ సహ సంయోజక్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుకుంటేనే బాలికలకు ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న గోల్కొండ ఎస్సై శ్రీలత

గోల్కొండ: చదువుకుంటేనేబాలికలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గోల్కొండ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత అన్నారు. శనివారం గోల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైబర్ అంబాసిడర్ ఇన్‌వెస్టిట్యూర్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, పోలీసుల మధ్య ఉండాల్సిన సంబంధాల గురించి వివరించారు. బాలికల రక్షణ కోసం పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని, వారి కోసం ప్రత్యేక చట్టాలు కూడా రూపొందించబడ్డాయన్నారు. అంతేకాకుండా బాలికలపై అత్యాచారాలు, చదువునే చోట, సమాజంలోని వివక్షపై కూడా ఎన్నో చట్టాలు ఉన్నాయని ఆమె స్పష్టం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.ఎస్. అనురాధ దేవి, సుబ్బారావు, హేమలత, భాగ్యరేఖ, సునీల్‌కుమార్ తదితరులున్నారు.

## అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ



కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రభాకర్, నందకిశోర్ వ్యాస్ బిలాల్, గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: అబిడ్స్ కట్టెలమండిలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ చేపట్టారు. కట్టెలమండి డబుల్‌బెడ్‌రూమ్ బస్తీ సంఘం వారు ఏర్పాటు చేసిన ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రభాకర్, రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకులు నందకిశోర్ వ్యాస్ బిలాల్, గడ్డం శ్రీనివాస్ యాదవ్, ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్, ఆశీష్‌కుమార్ యాదవ్, బీజేపీ నాయకులు విక్రమ్‌గౌడ్ విగ్రహాలను ఆవిష్కరణ చేసి నివాళులర్పించారు. యువత అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో పయనిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం అధ్యక్షులు దాసరి రాజ్‌కుమార్, నాయకులు నందకుమార్, ఆనంద్ సింగ్, పప్పుమాత్రే, కోటి శైలేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇరువర్గాల దాడిపై పోలీసుల ఆరా

- అదుపులో ముగ్గురు
- సుమోటోగా కేసు నమోదు

చార్మినార్: చార్మినార్ పోలీసు స్టేషన్ పరిధి పత్తర్‌గట్టిలో ఇరువర్గాల నడుమ జరిగిన ఘర్షణలోని నిందితులను గుర్తించడానికి పోలీసులు శనివారం రంగ ప్రవేశం చేశారు. మాటామాటా పెరిగి దాడులకు పాల్పడిన విషయంపై చార్మినార్ పోలీసులు ఇప్పటికే సుమోటో కేసు నమోదు చేసి ఘటనా స్థలం వద్ద శనివారం ఆరా తీశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా దాడులకు పాల్పడిన వారిని గుర్తించి శనివారం ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. చార్మినార్ ఇన్‌స్పెక్టర్ గురునాయుడు వివరాల ప్రకారం..శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొని తిరిగి మదీనా సర్కిల్ మీదుగా చార్మినార్ వైపు ద్విచక్ర వాహనాలపై కొంతమంది యువకులు వస్తుండగా పత్తర్‌గట్టి మసీదు వద్ద మరో వర్గానికి చెందిన కొంత మంది యువకులకు నడుమ ఘర్షణ జరిగి ఒకరినొకరు కొట్టుకున్నారు. అక్కడే ఉన్న పోలీసులు గుమిగూడిన వారిని చెదరగొట్టారు. ప్రస్తుతం సుమోటో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్న సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని గొడవ జరగడానికి గల కారణాలపై ఆరా తీస్తున్నామని ఇప్పటి వరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఇన్‌స్పెక్టర్ గురునాయుడు తెలిపారు.